# నేను నాస్తికుణ్ణి



గోరా

# దైవ విశ్వాసమా? ఆత్మవిశ్వాసమా?

నేను నాస్తికుణ్ణి. నా జీవితానికి ఇతరుల జీవితానికీ తేడా ఏమిటి? తేడా లేనప్పుడు ఏ పేరు పెట్టుకుంటేనేం? వేరు వేరు సిద్ధాంతాల పేర్లు పెట్టుకుని తగాదాలు తెచ్చుకోవడానికేనా? వాదోప వాదాల కోసమేనా? అలాగ కాకపోతే నాస్తికత్వం వలన నా జీవితం ఎలా మారింది? ఇంకా సౌఖ్యవంతంగా ఎలా వుంటుంది? నాస్తిక దృక్పథం వలన నా విజ్ఞానంలో నా ప్రవర్తనలో ఏం మార్పులు వచ్చాయి?

అన్నింటికంటే ముందు ఒక ప్రశ్న ఉంది. నేను ఆస్తిక సాంప్రదాయంతో పెరిగిన వాడినే, మా అమ్మ, నాన్నగారి తర్ఫీదు వల్ల, నా చూట్టూ వున్న వాతావరణం వల్ల నాకూ దేవుడిలో చాలా నమ్మకం ఉండేది. ఇప్పుడు ఆ నమ్మకాన్ని ఎందుకు వదిలి పెట్టవలసి వచ్చింది?

ఒక ఆలోచన నన్ను నాస్తికునిగా మార్చింది. నిత్య జీవితంలో నా పని నేను చేసుకొంటూంటే నాకు దేవుడు ఎందుకు? నా పనులు దైవాధీనం అయితే, నేను కష్టపడి కృషి చేయడం ఎందుకు? నేను ప్రయత్నం చేస్తే దాని ఫలితం దైవం ఇస్తుందట. ఇది నాకు అవకతవకగా కనబడింది. ఒక ఫలితం కావాలని, వస్తుందని ఆశించి నేను చేసే ప్రయత్నానికే అర్థం వుంటుంది. ఉదాహరణకు నేను పరీక్షకు వెడతాను. నా కృషి వలన నేను ప్యాసు అవుతానని ఆశ నాకు వుంటేనే నేను శ్రద్ధగా చదువుతాను. నేను ఎంత చదివినా ఫలితం దైవాధీనం అంటే, నాకు ఆ పని బాధ్యతారహితంగా ఉంటుంది. ఇది దైవ విశ్వాసాన్ని నేను వదిలివేయాలి. అపుడు ప్రయత్నమూ నాదే, ఫలితమూ నాదే. ఇది నాస్తికదృష్టి. నా ప్రవర్తన బాధ్యతాయుతంగా వుంటుంది. నాపనులకు నేనే బాధ్యత తీసుకోవాలంటే, నాకు దైవ విశ్వాసం అనవసరం. అనవసరమేకాదు, నా కృషికి అడ్డుపడుతున్నది కూడా. అందుచేత దైవ విశ్వాసాన్ని నేను వదిలిపెట్టాను.

నాస్తికత్వం అంటే దైవ విశ్వాసాన్ని వదలిపెట్టడమే అని సాధారణంగా అంటారు. నేనూ మొదట అలాగే అనుకున్నాను. కాని అది నాస్తికత్వానికి సంపూర్ణమైన నిర్వచనం కాదు. నిజానికి నాస్తికత్వం అంటే సంపూర్ణ ఆత్మ విశ్వాసం, ఆత్మ విశ్వాస వికాసానికి దైవనమ్మిక అడ్డుపడుతున్నది. కాబట్టి దైవ విశ్వాసాన్ని తొలగించాలి.

నేను బాధ్యతాయుతంగాను, కార్యదక్షతతోనూ జీవించాలంటే నేను నాస్తికుణ్ణి అయితీరాలి. నాస్తికుణ్ణి అవగానే మానవజీవితంలో వివిధ విషయాలపట్ల నా దృష్టి, నా ప్రవర్తన ఎలాగ మారాయి?

# విరామ మెరుగని ఆశా విప్లవమే నాస్తికత్వం

నాలో నాస్తికదృక్పథం ఏర్పడగానే ఒక మార్పు వచ్చింది. నాకు పనిలో పట్టుదల పెరిగింది. ప్రతీపనీ బాధ్యతాయుతంగా చేయడం మొదలు పెట్టాను. నా కృషికి ఏదీ అడ్డు లేదు. అపరిమితమైన శక్తి

# నాస్తికుని ప్రజాస్వామికం

ప్రజాస్వామికం అంటే ప్రజలే పరిపాలకులు కదా. పరిపాలకులు ఎవరయినా బానిసలుగానూ, బాధలోనూ వుండడానికి  ఒప్పుకుండటారా? ఇది అసందర్భం. అటువంటప్పుడు ఈనాడు ప్రజాస్వామికాలలో కొందరు అస్పృశ్యులుగాను, కొందరు దరిద్రులుగాను ఎందుకువుంటున్నారు? నిజంగా ఈ అస్పృశ్యులకూ ఈ పేదలకూ పరిపాలనలో జోక్యమువుంటే, వారిని అణచి పెట్టి బాధించే ప్రభుత్వాన్ని వారు నిర్మించుకుంటారా?

కాని, ఈనాడు ప్రతి వయోజనునికి ఓటువున్నా, ప్రజలలో దారిద్ర్యం, బానిసత్వం వున్నాయి కనుక ఓటు వున్నంత మాత్రాన ఇది ప్రజా స్వామికం కాదని ఋజువుగుచున్నది. ఓట్ల వల్ల ప్రభుత్వ విధానాన్ని తారుమారు చెయ్యవచ్చునని సిద్ధాతం ఉన్నప్పటికీ ఆచరణలో అది అంతగా జరగటం లేదు.

ప్రజల చేతుల్లో ఓటు ఉన్నంత మాత్రాన చాలదు. ఆ ఓటు వినియోగముకూడా తెలియాలి. ఉదాహరణకు నా చేతిలో తుపాకి వుందనుకోండి. ఆ తుపాకీని పేల్చడం నాకు తెలియకపోతే నన్ను ఒక చిన్న పిల్లవాడు వచ్చి హింసించి పోవచ్చును. కాని నేను ఆ తుపాకీని వినియోగించినట్లయితే పదిమంది నా మీద పోరాటానికి వచ్చినా ఎదరుర్కోగలను. చేతకానివాని ఆయుధంలాగే పేదవాని ఓటు ఈ రోజున ఉపయోగం లేకుండా పోతున్నది. పేదవాని ఓటు నిరుపయోగం అవడంచేతనే, ఈ ప్రభుత్వాలలో నిజానికి కొద్దిమంది ధనికులే పెత్తనం చేస్తున్నారు. వారికి అనుకూలంగానే పరిపాలన జరుపుకుంటున్నారు. చేతిలో అధిక ఓట్లు వుండికూడా, పేరుకు పరిపాలకు లై కూడా పేద ప్రజానీకం బాధల్లోనూ బానిసత్వంలోనూ పడివున్నారు.

పేదలు ఎందుచేత తమ ఓటును సద్వినియోగం చెయ్యడం లేదు? వారి కష్టనిష్టూరాలను తీర్చేది దైవం అనుకుంటున్నారు గాని, ప్రభుత్వవిధానం అని వారు గ్రహించలేదు. దైవారాధనలో తీసుకున్నంత శ్రద్ధ పరిపాలనా పద్ధతులు అర్థంచేసుకొనుటకు చూపుటలేదు. వారి ఓటు  మొగమాటాల్లో పడిపోతున్నది. తమ ఓటు విలువలు వారు గ్రహించకపోవుటచేత రాజకీయంగా అది నిరుపయోగం అవుతున్నది. అందుచేత ఆ నాటి ప్రభుత్వాలు పేరుకు ప్రజాస్వామికాలే గాని నిజానికి అవి ధనికుల నియంతృత్వాలు.

ఈ ప్రభుత్వాన్ని నిజంగా కూడా ప్రజాస్వామికాలుగా చెయ్యాలంటే ప్రజల దృష్టిని పరలోకం నుంచి ప్రభుత్వ విధానాల వైపు మరలించాలి. వారి సుఖదు:ఖాలు పరిపాలనా పద్ధతుల్ని అనుసరించి ఉంటాయని తెలియచెప్పాలి. ఇది చెయ్యగలిగింది నాస్తిక దృక్పథమే. నాస్తికుల ప్రజాస్వామికమే నిజమైన ప్రజాస్వామికం.

నాస్తికుని ప్రజాస్వామికంలో సమానత వచ్చితీరుతుంది. ఎందుకనగా ఏ పరిపాలకుడూ బానిసగా ఉండడానికి ఒప్పుకోడు. అందరూ తమతమ ఓట్లను రాజకీయదృష్టితో వినియోగించుటచేత సమానతలకు అనుకూలమగు ప్రభుత్వ విధానాన్నే నిర్మించుకుంటారు.

# అనుభవం - ఆశయం

"చరిత్ర ఒక చక్రం" అను లోకోక్తి ఉంది. చరిత్రలో జరిగిన విషయాలే మళ్ళా తిరిగి జరుగుతాయని దీని అర్థం. **(History repeats itself)**. ఒక దేశానుభవం బట్టి ఇంకొక దేశం భావి నిర్ణయించవచ్చు అనుకుంటారు. విప్లవాలు, విధానాలయొక్క ఫలితాలను చరిత్రనుభవాలను బట్టి ఊహిస్తారు. మార్క్సు తన సిద్ధాంతాన్ని గత చరిత్రనుగత సత్యాల మీద ఆధారపరచి భావిలో ఒక బాట వేశాడు. నిజమే. చరిత్ర అనుభవం మీద ఆధారపరచి రాబోయే సందర్భాలను గురించి కొంత ఊహించి ముందు జాగ్రత్త పడుతున్నాం. కాని నాస్తిక దృష్టితో చూస్తే చరిత్ర యొక్క ప్రాముఖ్యత ఎంతవరకు?

ఇనుపముక్కను ఎన్నిసార్లయినా వేడిచేయవచ్చును, ఎన్నిసార్లయినా చల్లార్చ వచ్చును. ప్రతీసారీ పాతరీతిగానే మారుతూ వుంటుంది. కాని ఒక మనిషికి ఒక మాటచెప్పి ఒక పనిని ఒక పర్యాయం చేయించవచ్చు. ఇంకోసారి అదేమాట చెప్పి ఆయనచేత అదే పని చేయించలేము. అలాగే ఒక పేచి వేసి వక వస్తాదును కుస్తీలో చిత్తు చేయవచ్చు. అదే పేచీతో ఆయన్ని ఇంకోసారి ఓడించలేము. ఎందుచేత? మనిషికి జ్ఞాపకశక్తి ఉంది.

ఊహ ఉంది. పాత అనుభవాన్ని మరల అదే విధంగా జరుగనివ్వడు. దానిలో మాటిమాటికి మార్పులు తెస్తూ ఉంటాడు. అదే అభివృద్ధి. అనుభవాలు చక్రంవలె గిర్రున తిరిగితే అది అభివృద్ధి కాదు. పాత అనుభవాల మీద కొత్త పోకడలు వస్తేనే అభివృద్ధి అవుతుంది. ఈ కొత్త పోకడలే మానవుని వ్యక్తిత్వం, ప్రత్యేకత. అందుచేత మానవ చరిత్ర చక్రం వంటిది కాదు. గతంవలె భావి ఉండనక్కరలేదు.

ఇంతవరకు మానవులలో ఆస్తిక భావాలు ఉండుటచేత వారి వ్యక్తిత్వం బయటపడుతు లేదు. వారి జీవితం దైవాధీనమో, కర్మవశమో అనుకొని ప్రయత్నాన్ని విజృంభింపచేయకుండా ముణుచుకుని కూర్చుంటున్నారు. ఆర్థిక, భౌతిక సుడిగుండాలలో కొట్టుకుపోతున్నారు. వారి వ్యక్తిత్వం తక్కువ అవడంచేత వారి చరిత్ర కూడా చక్రంవలెనే చాలా భాగం ఇంత వరకు ఉంది. అందుకే మార్క్సు అలా అనుకున్నారు.

కాని, నాస్తికదృష్టి పెంపొందుతున్న కొద్దీ వ్యక్తిత్వం విజృంభిస్తుంది. పరిస్థితులకు తాను లొంగేబదులు మానవుడు పరిస్థితుల్ని తానే లొంగించుకుంటాడు. అప్పుడు చరిత్ర విషయాలు సమాచారాలే అవుతాయిగాని, మానవుల భావిని నిర్ణయించే సత్యాలు కావు.

నాస్తికుని జీవితంలో అనుభవంకంటే ఆశయమునకే ప్రాముఖ్యత. గతంకంటే భావివైపే దృష్టి, చరిత్ర పరిశోధన కంటే ఆశయసిద్ధికే కృషి. ఒక సమాజంలోనో ఒక విషయం జరిగితే ఇంకొక దేశంలో గాని, సమాజంలోగాని అట్లే జరుగుతునని చెప్పుట, జరుగనిచ్చుట ఆస్తిక సాంప్రదాయము. అది మానవ వ్యక్తిత్వానికి లోపం. వ్యక్తిత్వాన్ని (వా.స.వ్య) బలపరిచే నాస్తిక దృష్టి చరిత్రను మరల అలాగే జరుగనివ్వదు. ఆశయం వైపు నడిపిస్తూ ఉంటుంది. నాస్తికుని జీవితంలో చరిత్రకీ, అనుభవానికీ అంతగా ప్రాధాన్యతలేదు. ఆశయము, కృషి ప్రాముఖ్యత వహిస్తాయి.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Nenu+Nastikunni**

* * *